క్లుప్తంగా

ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వినతి



నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ భూములను కబ్జా నుంచి పరిరక్షించాలని కోరుతూ ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్‌లకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజేందర్ మాట్లాడారు. పట్టణంలోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్నారు. మల్లంపల్లి, ఖానాపురం రోడ్లలో అక్రమంగా ఫంక్షన్ హాళ్లు నిర్మించారని చెప్పారు. సదరు స్థలాలపై సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

కాకతీయ 'యూత్' కార్యవర్గం ఎన్నిక


లెంకాలపల్లి రవి


ఓడపెల్లి ప్రవీణ్

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో కాకతీయ యూత్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లెంకలపల్లి రవి, ఉపాధ్యక్షుడిగా బూస రాజు, ప్రధాన కార్యదర్శిగా ఓడపెల్లి ప్రవీణ్, కోశాధికారిగా లెంకలపల్లి రవికుమార్, క్రీడల కార్యదర్శిగా బుద్దె వెంకటేశ్, ముఖ్య సలహాదార్లుగా బత్తిని ఉమేశ్, కెల్లపు నవీన్, లెంకలపల్లి కుమార్, ముదురు అశోక్, ఊరుగొండ శివ, దొనికెల సురేశ్ ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన చిరుతం సంపత్, అతని కుమారుడు సాయిరాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి సంపత్‌తో పదో తరగతి చదువుకున్న మిత్రులు గురువారం రూ.20 వేల 500 సాయం అందజేశారు. తొలుత సంపత్, సాయిరాం చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంపత్ స్నేహితులు తాళ్ల సునీల్, చెరుపల్లి రాజు, సదిరం రాజు, వీరభద్రయ్య, ఎడ్ల కుమారస్వామి, రాజేందర్, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌పేటలో..



చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేట గ్రామానికి చెందిన కలకొండ లక్ష్మణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పంపించిన రూ.20 వేల నగదు సాయాన్ని మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి గురువారం అందజేశారు. తొలుత లక్ష్మణమూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతం మహేందర్, మాజీ వార్డు సభ్యులు ఎరుకల రాజ్‌కుమార్, తోట రమేశ్, అమీనాబాద్ సొసైటీ వైస్ చైర్మన్ పెండ్లి మల్లయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఆర్' ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జలగం (ఐత) లావణ్య రవి దంపతుల కుమారుడు అన్వేశ్ న్యూమోనియా బారిన పడి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వైద్యం కోసం రవి దంపతులకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత అన్వేశ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నాచినపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన శ్రీశ్రీనివాస శరణాగత భజన మండలి భక్తురాలు బొమ్మినేని కమలమ్మ (70) గురువారం అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయానికి చెందిన భజన మండలి సభ్యులు ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేలు సాయం అందించారు.

తారుపోయి గుంతలు మిగిలె..!

- తిమ్మాపూర్–ఎల్లూగ్‌ర్ స్టేషన్ రోడ్డు దుస్థితి
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

సంగెం : మండలంలోని తిమ్మాపూర్–ఎల్లూగ్‌ర్ స్టేషన్ ఆర్ అండ్ బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెన్యూవల్ చేయాల్సి ఉండగా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో గత వానాకాలంలో గుంతలు మరింత పెద్దగా తయారయ్యాయి. కంకర తేలి వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయి. వాహనాల్లో ప్రయాణించే వ్యక్తులు నడుము నొప్పులతో ఆస్పత్రి పాలవుతున్నారు. కాగా ఈ దారిలో తిమ్మాపూర్, ఎల్లూగ్‌ర్ స్టేషన్, తూర్పుతండాల వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, ఎల్లూగ్‌ర్ స్టేషన్ నుంచి తూర్పుతండా వరకు బీటీ రోడ్డు వేశారు. తిమ్మాపూర్ నుంచి ఎల్లూగ్‌ర్ స్టేషన్ గేట్ తండా వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర బీటీ వేయకపోవడంతో గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. 'తారు పోయి గుంతలు మిగిలె..!' అని ప్రయాణికులు ఉసూరుమంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలు పడి కంకర తేలిన రోడ్డు

తీవ్ర ఇబ్బందులు

తిమ్మాపూర్ నుంచి ఎల్లూగ్‌ర్ స్టేషన్ వరకు రోడ్డు గుంతలు పడడంతో ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాకపోకలు సాగించాలంటే నరకానికి వెళ్లినట్లు ఉంది. వాహనాలు దెబ్బతింటున్నాయి. బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు చేయించాలి.

– గుగులోత్ బాలు, బీకోజీనాయక్ తండా

ప్రణాళికలు రూపొందించాం

రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. రోడ్డు రెన్యూవల్ కోసం ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు పనులు చేపడతాం. సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– షఫీయుద్దీన్, ఏఈ, ఆర్ అండ్ బీ శాఖ

అవగాహనతో చట్టాల సద్వినియోగం


ప్రచార కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న తిరుమల, స్వప్న

నర్సంపేట : అవగాహన పెంచుకోవడం ద్వారా బాధిత మహిళలు రక్షణ చట్టాలను సద్వినియోగం చేసుకోగలరని సఖి సెంటర్ కేసు వర్కర్లు తిరుమల, స్వప్న తెలిపారు. పట్టణంలో గ్రామైక్య మహిళా సంఘాల సభ్యులకు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, సఖి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు, బాలికల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్‌తోపాటు పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి, తదితర సేవలు ఉచితంగా 24 గంటలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేస్తే సహాయం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న హింస, వాటికి కారణాలు, మహిళల, బాలికల హక్కుల చట్టాలు, బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, సీనియర్ సిటిజన్స్ యాక్టు, అత్యవస పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. అత్యావసర పరిస్థితుల్లో డయల్ 100, 181, 1098, 14567 నంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వీఓఏలు శ్రీలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత స్కూల్‌లో మళ్లీ కలుసుకున్న నేపథ్యంలో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలను పరిశీలించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు స్నేహలత, శ్రీమతి, యుగేందర్, పరమేశ్వర్, చంద్రసేన, రామారావు, ఎల్లయ్య, జగదీశ్వర్ దాస్, అనిత, కృష్ణకుమారి, శ్రీనివాసచారి, సుజాత, శ్రీనివాస్, రాజమల్లు, దామోదర్, సురేశ్, మనోజ్‌కుమార్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు రూ.20 వేల విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు.


కంప్యూటర్ బహూకరిస్తున్న పూర్వవిద్యార్థులు

మండలంలో బీజేపీ కార్యాలయం ప్రారంభం



చెన్నారావుపేట : మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వనపర్తి మల్లయ్య, సంగెం శంకర్, పార్లమెంటరీ కమిటీ కోకన్వీనర్ కట్ల రాంచందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, నర్సంపేట అధ్యక్షులు సందీప్, అశోక్, విజయ్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, ఎర్ర రాజు, సాంబరాజు, విఘ్నేశ్ గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : సర్వేను పరిశీలిస్తున్న సౌజన్య



నెక్కొండ : సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్



సంక్షేమ పథకాలపై సర్వే షురూ

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని ఖానాపురం, నెక్కొండ, రాయపర్తి, దుగ్గొండి మండలాల్లో సంక్షేమ పథకాలపై సర్వే గురువారం షురూ అయ్యింది. ఆయా మండలాల్లో సర్వేను స్పెషల్ ఆఫీసర్ సౌజన్య, తహసీల్దార్లు కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓలు సునీల్ కుమార్, ప్రవీణ్‌కుమార్, కిషన్, అరుంధతి పరిశీలించి మాట్లాడారు. సర్వేలో అధికారులకు ప్రజలు సహకరించాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు అర్హుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయించాలని చెప్పారు.


రాయపర్తి : సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

గత ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి

- రైతు సమన్వయ సమితి మాజీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి

నర్సంపేట : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చొరవతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే పట్టణంలో అభివృద్ధి జరుగుతోందని రైతు సమన్వయ సమితి మాజీ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో రవీందర్‌రెడ్డి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం టఫ్ అండ్ కో నుంచి రూ.40 కోట్లు మంజూరు చేయగా వాటితో పట్టణంలో సైడ్ డ్రైనేజీ కాల్వల, సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. సుదర్శన్‌రెడ్డి కృషి వల్లే పాకాల, రంగయ్య చెరువులకు ఉగాది రోజు మత్తళ్లు పడుతున్నాయని, ఏటా రెండు పంటలు పండుతున్నాయని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ టఫ్ అండ్ కో నిధులను కేవలం కొన్ని వార్డులకు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఆందోళనలు చేపడతామని చెప్పారు. సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, క్లస్టర్ బాధ్యులు బండి రమేశ్, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వెన్నుముద్దల శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు రుద్ర మల్లీశ్వరి ఓంప్రకాశ్, నాగిశెట్టి పద్మ ప్రసాద్, పాషా, రాయిడి కీర్తి దుశ్యంత్‌రెడ్డి, దేవోజు తిరుమల సదానందం, రామ సహాయం శ్రీదేవి సుధాకర్‌రెడ్డి, బాణాల ఇందిర రాంబాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు వాసం కరుణ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు



చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చెట్టబోయిన సారమ్మ (82) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కూతురు సాంబలక్ష్మి తలకొరివి పెట్టింది. సారమ్మ మృతదేహానికి ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) నాయకుడు చెట్టబోయిన శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దొంతరబోయిన నగేశ్, అశోక్, రొడ్డ కుమారస్వామి, గొర్రె వంశి, కార్తీక్, రాకేశ్, రాజేశ్, మోహన్, అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్'లో ఫలదీకరణ కీటకాలు కీలకం

- డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జ్యోతి

దుగ్గొండి : ఆయిల్‌పామ్ పూల ఫలదీకరణలో కీటకాలు కీలకమని డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జ్యోతి తెలిపారు. మండలంలోని కేశవాపురం, లక్ష్మీపురం, పొనకల్ గ్రామాల్లో రెండున్నరేళ్ల సాగు కాలం పూర్తి అయిన ఆయిల్‌ఫామ్ తోటల రైతులకు గురువారం ఆమె ఎలైదోబిస్‌కామెరునిక్స్ అనే ఫలదీకరణ కీటకాలు అందజేసి మాట్లాడారు. తోటలు రెండున్నరేళ్ల వయసు దాటితే పూలు కాయలు, పండ్లుగా మారడానికి ఫలదీకరణ కోసం ఎలైదోబిస్‌కామెరునిక్స్ కీటకాలు ఉపయోగపడతాయని చెప్పారు. తోటలోని ఒక చెట్టు వద్ద పూసిన మగపూల గుత్తులపై ఉన్న పుప్పొడి మీద కీటకాలను వదిలితే అవి వృద్ధి చెందిన చుట్టూ 8 కిలోమీటర్ల మేర తోటల్లో ఫలదీకరణకు ఉపయోగపడతాయని తెలిపారు. ఫలదీకరణతో కాయలు బాగా వచ్చి దిగుబడి పెరుగుతుందని వివరించారు. తోటలు రెండున్నరేళ్ల వయసులోకి వచ్చిన రైతులు తమను సంప్రదిస్తే కీటకాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, రైతులు బుస్సారి బాబురావు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.


కీటకాలను అందజేస్తున్న ఉద్యాన అధికారి జ్యోతి

'అర్హులకు రూ.12 వేలు ఇవ్వాలి'

నర్సంపేట రూరల్ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కార్డు కలిగిన అర్హులకు రూ.12 వేలు చొప్పున భృతి ఇవ్వాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పలు ఆంక్షలతో పేదలకు రూ.12 వేలు తగ్గించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కొర్రీలు పెట్టకుండా ఈజీఎస్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ రూ.12 వేల సాయం అందించాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, నాయకులు మోతె జయపాల్‌రెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, మోటూరి రవి, కొడారి రవి, భూక్య వీరన్న, కడారి కుమారస్వామి, జర్పుల వీరన్న, కందుల రాజిరెడ్డి, అల్లి రవి, పత్రి కుమారస్వామి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త పొట్లపల్లి శ్రీరాములు తల్లి పూలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దయాకర్‌రావు వెంట నాయకులు మార్గం భిక్షపతి, తూళ్ల కుమారస్వామి తదితరులున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎన్పీడీసీఎల్ ఏడీఈ లక్ష్మయ్య

నల్లబెల్లి : వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ నర్సంపేట ఏడీఈ లక్ష్మయ్య తెలిపారు. మండలంలోని కొండాపూర్‌లో విద్యుత్ అధికారులు గురువారం నిర్వహించిన పొలంబాట కార్యక్రమం సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అధ్యయనం చేశారు. అనంతరం ఏడీఈ లక్ష్మయ్య మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ తిరుపతి, ఏఈ హరిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, నాయకులు కొండ నారాయణ, జిల్లా మునేందర్, డ్యాగల కృష్ణ, బైరబోయిన సురేశ్, గుళ్లపల్లి అశోక్, కల్తి వెంకటేశ్వర్లు, పాషా, ఈసం సుమన్, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏడీఈ లక్ష్మయ్య

బీసీ రాజ్యాధికార సాధనే ధ్యేయం

- ఆర్‌ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్

గీసుకొండ : బీసీ రాజ్యాధికార సాధనే ధ్యేయం కోసం ఈనెల 19 నుంచి సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ స్వస్థలం నుంచి సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్టు రజక రిజర్వేషన్ పోరాట సమితి (ఆర్‌ఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ గాడ్గే తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సైకిల్ యాత్ర నిర్వహించి బీసీలను చైతన్యవంతం చేయనున్నట్టు చెప్పారు. సైకిల్ యాత్ర అనంతరం బీసీ గర్జన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు వివరించారు. సైకిల్ యాత్ర, సభలను విజయవంతం చేయాలని కోరారు. తొలుత కుమార్‌ను సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, రాజగోపాల్, రమేశ్, సాంబయ్య, రాజ్‌కుమార్, అశోక్, సుమంత్, నర్సయ్య, రాజమొగిలి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

బియ్యం అందజేత

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన గూబ వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి వెంకటేశ్వరపల్లి యూత్ అసోసియేషన్ బాధ్యులు గురువారం 50 కేజీల బియ్యం, రెండు లీటర్ల నూనె, ఇతర సరుకులు సాయంగా అందజేశారు. తొలుత వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అసోసియేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

19న ఆత్మ గౌరవ యాత్ర


మాట్లాడుతున్న అన్వర్

వర్ధన్నపేట : ఈనెల 19న మహబూబాబాద్‌లో ఉద్యమకారుల ఆత్మ గౌరవ యాత్ర సభ నిర్వహించనున్నట్టు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ మండల అధ్యక్షుడు అన్వర్, పట్టణ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, జిల్లా నాయకుడు ఐత ప్రవీణ్ తెలిపారు. పట్టణంలోని ఫోరమ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులపై దాడిని తిప్పి కొడుతూ మానుకోట రాళ్ల రుచి చూపించిన నాటి ఉద్యమకారుల స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ఐక్యతతో ఆత్మ గౌరవం, సంక్షేమం కోసం సభను విజయవంతం చేయాలని కోరారు. 19న తొలుత అనంతారం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మానుకోటలోని అమరవీరుల స్తూపం వరకు పాదయాత్ర నిర్వహించి నివాళులర్పిస్తామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఇతర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ ప్రభాకర్, మాడిశెట్టి లక్ష్మణ్, వన్నాల శ్రీనివాస్, ఆరెల్లి కుమారస్వామి, చాదురాల కేదారి, విలాసారపు వెంకట్, సాయన్న, కన్నం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆంక్షల్లేకుండా రుణమాఫీ చేయండి'

నల్లబెల్లి : గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా ఆంక్షల్లేకుండా అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య లేఖ రాశారు. ఈ మేరకు ఆయన స్థానిక పోస్టాఫీస్ నుంచి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా లేఖను గురువారం పంపించారు. ఈ సందర్భంగా సాంబయ్య విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీపై సీఎం దృష్టి సారించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు నాగేందర్, శ్రీనివాస్, కుమారస్వామి, గోవిందు వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.


రిజిస్టర్డ్ పోస్టు చేస్తున్న సాంబయ్య

బోర్ స్టార్టర్ చోరీ

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం నర్సరీకి నీటిని సరఫరా చేసే స్మశాన వాటిక బోర్ స్టార్టర్ చోరీకి గురైందని పంచాయతీ కార్యదర్శి వికాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నర్సరీలో మొక్కలకు నీళ్లు పెట్టడానికి పంచాయతీ ఉద్యోగి ఐలయ్య గురువారం ఉదయం వెళ్లేసరికి స్టార్టర్ చోరీకి గురైంది.

18 నుంచి స్పోర్ట్స్ మీట్

రాయపర్తి : నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రాయపర్తి, వర్ధన్నపేట మండలాల్లో ఈనెల 18 నుంచి రెండ్రోజులపాటు బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని ఆర్గనైజర్ దోమల నవీన్ యాదవ్ తెలిపారు. స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన జట్లు, యువకులు సెల్ నంబర్ 9502126384, 9505496034ల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు బహుమతులు ఉండవని తెలిపారు. నిబంధనలు వర్తిస్తాయని వివరించారు.